
సాక్షి అనంతపురం

శుక్రవారం । 13 । డిసెంబర్ । 2024



టన్ను చీనీ రూ.27 వేలు
అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.27 వేల ప్రకారం విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.14
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.14, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
32.6°/ 18.8°
జిల్లా అంతటా గురువారం తుపాను వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు తగ్గాయి. చలి వాతావరణం కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పరాకాష్టకు ప్రచార పిచ్చి



బస్సులను ప్రారంభిస్తున్న జేసీ శివ్ నారాయణ్ శర్మ, అధికారులు

అనంతపురం అర్బన్: ప్రచార పిచ్చి పరాకాష్టకు చేరడమంటే ఇదే...విజయవాడలో స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్-2047ను శుక్రవారం ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రభుత్వ నిధులతో గురువారం జిల్లా నుంచి 170 మందిని ప్రత్యేకంగా ఐదు ఆర్టీసీ బస్సుల ద్వారా పంపడం గమనార్హం. ఇక్కడి నుంచి వెళ్లిన వారికి వసతి, తదితర ఏర్పాట్ల కోసం 11 మంది అధికారులను నియమించారు. డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్ ఆధ్వర్యంలో ఎనిమిది మంది అధికారులు ఈనెల 10నే విజయవాడ వెళ్లారు. తాజాగా బస్సులతో పాటు సీపీఓ అశోక్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య వెళ్లారు. ఎక్కడో జరుగుతున్న కార్యక్రమానికి ప్రభుత్వ నిధులు వెచ్చించి ఇంత మందిని పంపించడం ఏమిటి? ఇంత ప్రచారం అవసరమా..? అంటూ ఈ తతంగాన్ని చూసిన వారు చర్చించుకున్నారు.

నాణ్యమైన పత్తి తీసుకురండి



పత్తి నాణ్యతను పరిశీలిస్తున్న మార్కెటింగ్ ఏడీ

గుత్తి: రైతులు నాణ్యమైన పత్తిని తీసుకురావాలని అగ్రీ ట్రేడ్ మార్కెటింగ్ ఏడీ సత్యనారాయణ చౌదరి సూచించారు. గుత్తి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. గోడౌన్‌లో పత్తి నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి రైతులు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్టర్ చేయించాలన్నారు. ముందుగా పత్తి శాంపిల్‌తో గుత్తి వ్యవసాయ మార్కెట్ యార్డుకు వచ్చి పరీక్షించుకోవాలని, తర్వాత సరుకు తెచ్చి విక్రయించాలని సూచించారు. రైతులు నాణ్యమైన పత్తి తీసుకురావాలని, ఎన్ని క్వింటాళ్లయినా కొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డు సెక్రటరీ బాలాజీ రావు, శివ, సీసీఐ ప్రతినిధి భరత్ తదితరులు పాల్గొన్నారు.

బీమా ప్రీమియం కట్టించండి



సమీక్ష చేస్తున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అగ్రికల్చర్: పంటల బీమా పథకం వర్తించాలంటే ప్రీమియం చెల్లించడానికి మూడు రోజుల గడువు ఉన్నందున రైతులను ప్రోత్సహించాలని జేడీఏ ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. గురువారం తన చాంబర్‌లో ఏడీఏ, ఏఓలతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 15తో గడువు ముగుస్తున్నందున రైతులు ప్రీమియం కట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మంగళ, బుధవారం తప్పనిసరిగా 'పొలం పిలుస్తోంది' నిర్వహించి రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పథకాలు వినియోగించుకునేలా చూడాలన్నారు. రబీలో ఇప్పటి వరకు 1.10 లక్షల హెక్టార్ల పంటలు వేశారన్నారు. ఈ క్రాప్ వేగవంతంగా చేయాలని సూచించారు. తుపాను ఉన్నందున రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య

రాప్తాడు: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలని సంబంధిత అధికారులను జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య ఆదేశించారు. 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాల'పై రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం రెండో రోజు కొనసాగిన సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాధాన్యత క్రమంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను నమ్మించి అధికారం చేపట్టిన చంద్రబాబు ఆర్నెల్లయినా వాటి అమలు దిశగా ఆలోచించడం లేదు. మరీ ముఖ్యంగా రైతు సమస్యలను అసలు పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకు వైఎస్సార్‌సీపీ సన్నద్ధమైంది. ఇందులో భాగంగా నేడు జిల్లా కేంద్రమైన అనంతపురంలో భారీ ర్యాలీ నిర్వహించనుంది.



దగా పడిన రైతుకు దన్నుగా..

నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రైతు పోరుబాట

- అన్నదాతలకు అండగా 'అనంత'లో భారీ ర్యాలీ
- హామీలు నెరవేర్చడంలో చంద్రబాబు సర్కారు ఘోరంగా విఫలం
- అన్ని వర్గాల్లోనూ పెల్లుబుకుతున్న అసంతృప్తి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రంలోనే వ్యవసాయ ఆధారిత జిల్లాగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు పేరుంది. ఇక్కడ ఉద్యాన పంటలు ఎక్కువగా ఉన్నాయి. మెట్ట పొలాలు కూడా అధికం. పప్పుశనగ, వేరుశనగ, కంది, ఆముదం తదితర పంటలు విరివిగా పండిస్తారు. అయితే, ఈ ఏడాది సరిగా వర్షాలు కురవకపోవడం, పంటలు చేతికందే సమయంలో తుపాన్లు వెరసి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇలాంటి సమయంలో అన్నదాతలను ఆదుకోవాల్సిన సర్కారు ఆ విషయాన్ని గాలికొదిలేసింది. ఒక్కో రైతుకు రూ.20 వేలు ఇస్తానని ఎన్నికల ముందు వాగ్దానం చేసిన చంద్రబాబు ముఖం చాటేశారు. ఇప్పుడు గిట్టుబాటు ధరలు కూడా లేవు. దీంతో రైతన్నలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.

అండగా వైఎస్సార్ సీపీ..

రైతుల కష్టాలపై సర్కారును ప్రశ్నించేందుకు ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ నడుం బిగించింది. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు అన్నదాతకు అండగా శుక్రవారం 'రైతు పోరుబాట' కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతపురంలోని కలెక్టరేట్ వద్దకు నాయకులు, కార్యకర్తలు కదం తొక్కనున్నారు. ఉదయం 10 గంటలకు నగరంలోని



బుక్కరాయసముద్రం మండలం కొత్తపల్లిలో దళారులకు వరి ధాన్యం విక్రయిస్తున్న రైతులు

జెడ్పీ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమవుతుంది. కలెక్టరేట్ వరకూ ముఖ్య నాయకులు, సమన్వయకర్తలతో పాటు కార్యకర్తలు, రైతులు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించనున్నారు.

అన్ని వర్గాలకూ మోసం

రైతులనే కాదు అన్ని వర్గాలనూ చంద్రబాబు సర్కారు మోసం చేసింది.

- 18 ఏళ్లు నిండిన ఒక్కో మహిళకు నెలకు రూ.1,500 ఇస్తానని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. పథకం అమలు కోసం ప్రస్తుతం జిల్లాలో రూ.10.20 లక్షల మంది ఎదురుచూస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో రైతు భరోసా కింద ఇచ్చిన ఆర్థిక సాయం..

సంవత్సరం	రైతులు	ఆర్థిక సాయం (రూ.కోట్లలో)
2019-20	284726	384.39
2020-21	298535	402.63
2021-22	277051	381.95
2022-23	276336	372.82
2023-24	294234	337.50

- 'తల్లికి వందనం' పథకం కింద 4.07 లక్షల మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15,000 ఇస్తామన్నారు. నేటికీ ఏ ఒక్కరికీ పైసా అందించలేదు.
- ఉచితంగా మూడు సిలిండర్లు అన్నారు. జిల్లాలో మొత్తం 12.45 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 5.93 లక్షలు 'దీపం', మరో 6.47 లక్షల సాధారణ కనెక్షన్లు ఉన్నాయి. వీరిలో ఏ ఒక్కరికీ ఇప్పటివరకూ ఉచిత సిలిండర్ అందలేదు.
- మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమంటూ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక దీపావళి అన్నారు.. దసరా అన్నారు.. అన్నీ పోయాయి. నేడు కూటమి ప్రజాప్రతినిధులు ఆ ఊసే ఎత్తడం లేదు.
- నిరుద్యోగులకు భృతి ఇస్తామన్నారు. కానీ, ఇప్పటివరకూ ఉద్యోగాలు రాలేదు.. భృతి ఇవ్వలేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ కోర్సులు చదివిన 8 లక్షల మంది యువత భృతి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

గిట్టుబాటు కావడం లేదు



నాకు 2.28 ఎకరాల పొలం ఉంది. ఇందులో టమాట పంట సాగు చేశా. ఇటీవల కురిసిన వర్షాలకు పంట మొత్తం దెబ్బతింది. దీంతో 15 కిలోల బాక్సు కేవలం రూ.50కు విక్రయించా. కనీసం రవాణ ఖర్చులు కూడా దక్కలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక పంటలకు గిట్టుబాటు దక్కని పరిస్థితి నెలకొంది.
– పాటిల్ అభిలాష్ రెడ్డి, బొమ్మగానిపల్లి, బ్రహ్మసముద్రం మండలం

పెట్టుబడి సాయమేదీ..?



నాకు 10 ఎకరాల పొలం ఉంది. 6 ఎకరాల్లో టమాట, 2 ఎకరాల్లో అరటి, 2 ఎకరాల వేరుశనగ సాగు చేశా. గత వైఎస్సార్‌సీపీ హయాంలో పంటల పెట్టుబడికి సాయం అందేది. కూటమి ప్రభుత్వం వచ్చాక సాయం మరిచారు. కనీసం పంటను పరిశీలించే అధికారులు కూడా కరువయ్యారు.
– రాజశేఖర్ రెడ్డి, రైతు, శెట్టూరు

ప్రభుత్వం ఆదుకోవాలి



నాకున్న మూడున్నర ఎకరాల్లో వరి పంట సాగు చేశా. ఇటీవల ఈదురుగాలులతో కూడిన వర్షం తాకిడికి పంట పూర్తిగా నేలపాలైంది. దీంతో వరి గింజలు మొలకెత్తాయి. రూ. లక్ష వరకు నష్టం వచ్చింది. గిట్టుబాటు ధరలు లేక అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.
– లక్ష్మీనారాయణమ్మ, యల్లనూరు

జయప్రదం చేయాలి



అనంతపురం కార్పొరేషన్: రైతాంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రైతు పోరుబాట' ర్యాలీని జయప్రదం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు జెడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగుతుందన్నారు. నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్తలు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలు, నాయకులు, కార్యకర్తలు, ప్రధానంగా రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ర్యాలీ అనంతరం రైతుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం అందించనున్నట్లు అనంత పేర్కొన్నారు.

అంతులేని మోసం

- రైతులకు పైసా విదల్చని చంద్రబాబు
- గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలకూ మంగళం

అనంతపురం అగ్రికల్చర్: కూటమి పాలనలో కరువు రైతుకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. 'వ్యవసాయం దండగ' అంటూ గతంలోనే రైతులను చిన్నచూపు చూసిన చంద్రబాబు తన బాణీని మార్చుకోలేదు.

- ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన ప్రధాన హామీల్లో ఒకటైన 'అన్నదాత సుఖీభవ' రైతుల పాలిట దుఃఖీభవగా మారింది. ఒక పక్క కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద రూ.2 వేల చొప్పున ఇప్పటికే రెండు దఫాలుగా పెట్టుబడి సాయం జమ చేసింది. చంద్రబాబు చెప్పినట్లు ఏటా రూ.20 వేలపై స్పష్టత కరువైంది. దాదాపు 2.90 లక్షల మంది రైతులకు రూ.580 కోట్లు ఇవ్వాలి. పీఎం కిసాన్‌తో కలిపి ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.14 వేలు ఇవ్వాలి. దాని ప్రకారం రూ.400 కోట్ల పైచిలుకు జమ చేయాల్సి ఉంటుంది.
- గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జూన్, జులైల్లో తప్పనిసరిగా పరిహారం ఇచ్చేది. గత ఐదేళ్లలో బీమా కింద రూ.1,967 కోట్ల భారీ మొత్తంలో పరిహారం అందించారు. గతేడాది వర్షాభావంతో పంటలు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో వైఎస్ జగన్ సీఎంగా ఉంటే పెద్ద మొత్తంలో పరిహారం వచ్చేదని రైతులు చెబుతున్నారు. చంద్రబాబు ప్రభుత్వం మాత్రం పరిహారం ఊసే ఎత్తడం లేదు.
- 2023 రబీలో వర్షాభావ పరిస్థితులతో ప్రధానపంట పప్పుశనగతో పాటు మిగతా పంటలు దెబ్బతిన్నాయి. అప్పటి ప్రభుత్వం 17 మండలాలతో కరవు జాబితా ప్రకటించింది. కేంద్ర కరువు బృందం కూడా ఆగస్టులో వచ్చివెళ్లింది. నిబంధనల మేరకు రూ.36 కోట్ల మేర పెట్టుబడిరాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) ఇవ్వాల్సి ఉండగా చంద్రబాబు ప్రభుత్వం దాని గురించి స్పష్టత ఇవ్వలేదు. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం ఏ సీజన్‌లో జరిగిన నష్టానికి అదే సీజన్ ముగిసేలోపు పరిహారం ఇచ్చి ఆదుకుంది. గత ఐదేళ్ల కాలంలో జిల్లా రైతులకు రూ.377 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేశారు.



ఇటీవల వర్షాలకు బొమ్మనహాళ్ వద్ద నేలకొరిగిన వరి పంట (ఫైల్)

- ఉచిత బీమా పథకాన్ని చంద్రబాబు రద్దు చేసి రైతులపై ప్రీమియం భారం మోపారు. రైతులు ఏటా రూ.100 కోట్లకు పైగా ప్రీమియం కట్టాల్సి ఉంటుంది. గత ఐదేళ్లు జగన్ ప్రభుత్వం ఉచిత బీమా కింద జిల్లా రైతులకు ప్రీమియం రూపంలో రూ.450 కోట్ల వరకు ఉపశమనం కల్పించారు.
- కూటమి ప్రభుత్వం వచ్చాక పంటలు పండక అప్పుల బాధతో ఇప్పటివరకూ 16 మంది వరకు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. అయితే, బాధితులకు నయాపైసా కూడా ప్రభుత్వం అందించలేదు. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం రెండు మూడు నెలల్లోనే బాధిత కుటుంబాలకు రూ.7 లక్షల మేర పరిహారం అందించి ఆదుకుంది. 280 మంది బాధిత రైతు కుటుంబాలకు రూ.17.40 కోట్ల ఎక్స్‌గ్రేషియా అందించింది.
- బ్యాంకుల్లో ఖరీఫ్, రబీ కింద రూ. లక్ష లోపు పంట రుణాలు తీసుకున్న రైతులకు గతంలో రూ.72 కోట్ల వరకు వడ్డీ మాఫీ చేయడంతో 3.40 లక్షల మంది సన్న చిన్నకారు వర్గాలు ఊపిరి పీల్చుకున్నాయి. చంద్రబాబు ప్రభుత్వం మాత్రం వడ్డీ రాయితీపై నోరు మెదపడం లేదు.
- ఖరీఫ్ పంట ఉత్పత్తులు చేతికొచ్చినా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో రైతులు అయినకాటికి దళారులు, వ్యాపారులకు అమ్మేసుకుంటున్నారు. గత ఐదేళ్లలో అప్పటి ప్రభుత్వం రూ.350 కోట్ల విలువ చేసే వ్యవసాయ ఉత్పత్తులను మద్దతు ధరతో కొనుగోలు చేసింది.
- ఈ ఖరీఫ్‌లో రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలకు కొర్రీ వేయడంతో జిల్లా రైతులకు తీరని అన్యాయం జరిగింది. ఏడు మండలాలను మాత్రమే కరువు జాబితాలో ప్రకటించి కేవలం రూ.19 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ ప్రతిపాదనలు పంపి అంతులేని ఆవేదన మిగిల్చారు.
- గత వైఎస్ జగన్ ప్రభుత్వం 40 శాతం రాయితీతో విత్తనం అందించింది. కానీ, నేడు కరువు పరిస్థితులు నెలకొన్నా కేవలం 25 శాతం సబ్సిడీతో పప్పుశనగ అందించడంతో జిల్లా రైతులపై రూ.6 కోట్ల వరకు అదనపు భారం పడింది. ఖరీఫ్‌లో వేరుశనగ, ఇతర విత్తనాలు కూడా నామమాత్రంగా పంపిణీ చేశారు. 80 శాతం రాయితీతో 27 వేల క్వింటాళ్ల ప్రత్యామ్నాయ విత్తనాలు ఇస్తామని చెప్పి కేవలం 10 వేల క్వింటాళ్లతో ముగించారు.
- సూక్ష్మ సేద్యం పరికరాల పంపిణీకి సంబంధించి చంద్రబాబు సర్కారు జిల్లాకు 41,200 హెక్టార్లకు ఇస్తామని ఉత్తుత్తి కేటాయింపులు చేసింది. ఆరు నెలల కాలంలో కేవలం 4 వేల హెక్టార్లకు మంజూరు చేశారు. పాడి రైతులకు అండగా ఉన్న అమూల్ పాలసేకరణ కార్యక్రమాన్ని బలవంతంగా మూతబడేలా చేశారు. పట్టు పరిశ్రమశాఖ, పశుసంవర్ధకశాఖ పరిధిలో కూడా ఎలాంటి పథకాలు లేక ప్రత్యామ్నాయ వ్యవసాయం కూడా చిన్నబోయింది.

ఏం కష్టం వచ్చింది 'తల్లీ'..

నాలుగు పదుల జీవితం..రెండు దశాబ్దాల దాంపత్యం. ముత్యాల్లాంటి పిల్లలు. కానీ ఆ తల్లికి ఏం కష్టమొచ్చిందో తెలీదు గానీ పాలబువ్వ పెట్టిన చేతులతోనే ఇద్దరు బిడ్డలకు విషం పెట్టింది. వద్దు.. వద్దంటున్నా విషపుగుళికల నీరు తాగించింది. ఆపై తానూ తాగింది. ఘటనలో తల్లీకుమారుడు మృతి చెందగా..కుమార్తె చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది.





మృతి చెందిన సుజాత, నాగ చైతన్య, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాహిత్య

- ఇద్దరు బిడ్డలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం
- తల్లి, కుమారుడు మృతి
- ఆస్పత్రిలో చావుబతుకుల నడుమ కొట్టుమిట్టాడుతున్న కుమార్తె



కుమార్తె, కుమారుడితో సుజాత దంపతులు

గార్లదిన్నె: కుటుంబ కలహాలతో ఓ మహిళ తనువు చాలించాలనుకుంది. తను వెళ్లిపోతే బిడ్డల పరిస్థితి ఏమిటని తీవ్రంగా ఆలోచించింది. చివరకు కుమార్తె, కుమారుడినీ తనవెంటే తీసుకువెళ్లాలని నిర్ణయించుకుంది. పిల్లలకు బలవంతంగా విషపు గుళికల నీరు తాగించి, తనూ తాగింది. ఈ ఘటనలో తల్లి, కుమారుడు మృతి చెందగా.. కుమార్తె ఆస్పత్రిలో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఈ ఘటన గురువారం గార్లదిన్నెలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. గార్లదిన్నె మండలంలోని యర్రగుంట్లకు చెందిన సురేష్‌కు శ్రీసత్యసాయి జిల్లా నల్లచెరువు మండలానికి చెందిన లక్ష్మీదేవి, వెంకటయ్య దంపతుల కుమార్తె సుజాత (38)కు 20 ఏళ్ల క్రితం వివాహమైంది.వీరికి కుమార్తె రాహిత్య, కుమారుడు నాగ చైతన్య (11)సంతానం. రాహిత్య ప్రస్తుతం చెన్నై సత్యభామ కాలేజీలో బీటెక్ ప్రథమ సంవత్సరం, నాగ చైతన్య గార్లదిన్నెలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నారు. సురేష్, సుజాత దంపతులు మూడేళ్ల నుంచి గార్లదిన్నెలో అద్దె భవనంలో నివాసం ఉంటూ కిరాణా షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కుటుంబ కలహాలు తలెత్తగా సుజాత జీవితంపై విరక్తి చెందింది.

తనతో పాటు పిల్లలనూ తీసుకువెళ్లాలని..

గురువారం ఉదయం భర్త సురేష్ గార్లదిన్నె నుంచి యర్రగుంట్లలోని వ్యవసాయ తోట వద్దకు వెళ్లగా... సుజాత గార్లదిన్నెలోని ఓ ఫర్టిలైజర్ షాపులో విషపుగుళికలు కొనుగోలు చేసి ఇంటికి తీసుకువెళ్లింది. అనంతరం తలుపులు వేసుకొని మొదట కుమార్తె రాహిత్య, కుమారుడు నాగ చైతన్యకు విషపు గుళికలు నీళ్లలో కలిపి తాపించే ప్రయత్నం చేసింది. పిల్లలు వద్దన్నా వినకుండా బలవంతంగా విషపుగుళికలు కలిపిన నీళ్లు తాగించింది. అనంతరం ఆమెకూడా తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. దీంతో కుమార్తె రాహిత్య బయటకు వచ్చి జరిగిన విషయాన్ని ఇరుగుపొరుగుకు తెలిపింది. వెంటనే వారు సుజాత, రాహిత్య, చైతన్యలను కారులో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుజాత మృతి చెందింది. కుమారుడు చైతన్య, కుమార్తె రాహిత్యకు మెరుగైన వైద్యం అందించేందుకు బెంగళూరుకు తరలిస్తుండగా.. మార్గమధ్యంలోనే సుజాత కుమారుడు నాగ చైతన్య మృతి చెందాడు. ప్రస్తుతం రాహిత్య బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. సుజాత, నాగచైతన్య మృతదేహాలను అనంతపురంలోని సర్వజనాస్పత్రి మార్చురీలో ఉంచారు.

మిన్నంటిన రోదనలు

సమాచారం తెలుసుకున్న సుజాత కుటుంబ సభ్యులు పెద్దసంఖ్యలో సర్వజనాస్పత్రికి చేరుకున్నారు. విగతజీవులుగా ఉన్న సుజాత, చైతన్యలను చూసి బోరున విలపించారు. ఏ కష్టం వచ్చిందని ఇంతపని చేశావు తల్లీ అంటూ వారు రోదించిన తీరు చూసి అక్కడున్న వారంతా కన్నీరు పెట్టుకున్నారు.

భర్తపై కేసు నమోదు

సుజాతను భర్త సురేష్ నిత్యం వేధిస్తుండేవాడని, చిన్న, చిన్న విషయాలకే ఘర్షణ పడి నెల రోజులైనా భార్యతో మాట్లాడేవాడు కాదని బంధువులు తెలిపారు. సురేష్ పెట్టిన మానసిక వేధింపులతోనే సుజాత పిల్లలతో కలిసి చనిపోవాలనుకుందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సుజాత, ఆమె కుమారుడు చైతన్య మృతికి భర్త సురేష్ కారణమని తెలిపారు. దీంతో సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.

కనులపండువగా శోభాయాత్ర




విశేష అలంకరణలో నెట్టికంటి ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహం, శోభాయాత్రలో మాలధారుల ఆనందోత్సాహం

గుంతకల్లు: పట్టణ పురవీధుల్లో గురువారం హనుమాన్ శోభాయాత్ర కనులపండువగా సాగింది. 40 రోజులుగా దీక్షలో ఉన్న స్వాములు ముందుగా మండల పరిధిలోని ఎన్.తిమ్మాపురం గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద భక్తిశ్రద్ధలతో ఇరుముడి ధరించారు. అనంతరం ర్యాలీగా పట్టణంలోని బళ్లారి గేట్ సమీపంలోని అభయాంజనేయస్వామి విగ్రహం వద్దకు చేరుకున్నారు. నెట్టికంటి ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంపై కొలువుదీర్చారు. బెంగళూరు నుంచి తెప్పించిన వివిధ రకాల పుష్పాలతో రథాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. కేరళ వాయిద్య కళాకారులు, నంద్యాల జిల్లా వెలుగోడుకు చెందిన కళాకారుల కోలాటం మధ్య శోభాయాత్ర సాగింది. బీరప్పగుడి సర్కిల్, ప్రధాన రహదారి, సత్యనారాయణపేట మీదుగా కసాపురం వరకు సాగిన ఉత్సవంలో జై శ్రీరామ్, జై నెట్టికంటి ఆంజనేయస్వామి నామస్మరణలు మార్మోగాయి. ఆలయ ప్రాంగణంలో మాలధారులు ఇరుముడి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వాణి, కమిటీ చైర్మన్ కె.సుగుణమ్మ పాల్గొన్నారు.

- నెట్టికంటి ఆంజనేయస్వామి వారి ఆలయంలో శుక్రవారం అత్యంత వైభవంగా హనుమద్ వ్రతం జరగనుంది.

క్లుప్తంగా

ఆ న్యాయస్థానాలను అనంతలోనే కొనసాగించాలి



దీక్షలో పాల్గొన్న న్యాయవాదులు

అనంతపురం: కర్నూలు, తిరుపతికి బదలాయించిన సీఐడీ, ఎన్‌డీపీఎస్ న్యాయస్థానాలను యథతథంగా అనంతపురంలోనే కొనసాగించాలంటూ జిల్లా కోర్టు ఎదురుగా న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 8వ రోజూ కొనసాగాయి. ఇందుకు సంబంధించి జారీ చేసిన జీఓలను తక్షణమే రద్దు చేయాలని కూటమి సర్కార్‌ను న్యాయవాదులు డిమాండ్ చేశారు. రిలే దీక్షలో న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు పాల్గొన్నారు. దీక్షకు బహుజన లాయర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బి. నారాయణప్ప, అడ్వైజరీ కమిటీ చైర్మన్.. విశ్రాంత జడ్జి కిష్టప్ప, జిల్లా అధ్యక్షుడు వీవై మూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వరి, ఉపాధ్యక్షుడు అజీజ్, శ్రీనివాసులు, గంగప్ప, సహాయ కార్యదర్శి రవికుమార్ మద్దతు తెలిపారు. దీక్షలో న్యాయవాదులు నారాయణప్ప, పి.మహేశ్వరి, ఈ.వై.మూర్తి, దేశాయి శ్రీనివాసులు, రవికుమార్, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

అందని ప్రభుత్వ సాయం.. ఆగని దోపిడీ

'మా కష్టం యాడ పడినా పోవట్లేదు. అరకొర వర్షాలకు పండించిన పంట కాస్త అమ్మకానికి పెడితే గిట్టుబాటు ధర లేదు. పోనీ పంటను నిల్వ చేసుకుని ధర వచ్చినప్పుడు అమ్ముకుందామనుకుంటే ప్రకృతి కరుణించకపాయ! రోజంతా వానమబ్బులే. ధాన్యం ఆరబోస్తుండగానే చినుకు పడతాంది. దీంతో గబగబ కుప్పలు పోసి కవర్ కప్పడంతోనే పొద్దంతా గడిచిపోతాంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. గిట్టుబాటు ధరా కల్పించలేదు. దీంతో అగ్గువని తెలిసినా దళారులకు అమ్ముకోక తప్పలేదు. కంకి తెంపిన కూలి కూడా గిట్టుబాటు కాలేదు' అంటూ వడియంపేట, కొత్తపల్లి గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



మొక్కజొన్న పంటను ఆరబోస్తున్న రైతు







బీకేఎస్ మండలం కొత్తపల్లి గ్రామంలో చినుకులకు ధాన్యం తడవకుండా కుప్ప చేస్తున్న మహిళా రైతు, వరి ధాన్యం కుప్పలపై కప్పిన కవర్లు, వడియంపేటలో వరిధాన్యాన్ని ఆరబోస్తున్న దృశ్యం

మొక్కజొన్న యంత్రంలో పడి వ్యక్తికి గాయాలు

బొమ్మనహాళ్: మొక్కజొన్న యంత్రంలో పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు... బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన యర్రగుడి వన్నూరు స్వామి బుధవారం అదే గ్రామ శివారులో రైతు వన్నప్పకు చెందిన మొక్కజొన్న పొలంలో పంట నూర్పిడి పనుల్లో పాల్గొన్నాడు. సాయంత్రం యంత్రంపై నిలబడి మొక్కజొన్న కంకులను వేస్తుండగా చైన్‌లింక్ పడి వరిబీజాలు తెగాయి. స్థానిక రైతులు వెంటనే బళ్లారిలోని బిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. కాగా, ప్రమాదం జరిగిన వెంటనే నూర్పిడి యంత్రంతో సహ యజమాని వజ్రకరూరు మండలం గంజికుంటకు చెందిన రాజు పరారయ్యాడు. రాజు అజాగ్రత్త కారణంగానే ప్రమాదం జరిగిందని, ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు.

దాడి కేసులో ఐదుగురి అరెస్ట్

తాడిపత్రి టౌన్: ఈ నెల 7న తాడిపత్రిలోని కృష్ణాపురం రోడ్డులో బేలార్లుపై జరిగిన దాడి ఘటనలో ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ సాయి ప్రతాప్ తెలిపారు. దాడి ఘటనలో మొత్తం తొమ్మిది మంది పాల్గొనగా, ఇందులో నలుగురు పరారీలో ఉన్నారన్నారు. గురువారం ఉదయం బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద తచ్చాడుతున్న నిందితులు చాకలి అమరనాథ్, శశికిరణ్, అజయ్‌తో పాటు ఇద్దరు మైనరు బాలురను గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. విచారణ అనంతరం మైనర్లను బాలుర పరివర్తన కేంద్రానికి తరలించి, మిగిలిన వారిని న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు వివరించారు. కాగా, పరారీలో ఉన్న నలుగురిలో ఒకరు మైనర్ ఉన్నారని పేర్కొన్నారు.

బాలికకు పెళ్లి... మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం

అనంతపురం సిటీ: ఇష్టం లేని పెళ్లి చేయడమేకాక... భర్తతో సంసారం చేయాలంటూ కుటుంబసభ్యులు ఒత్తిడి చేయడంతో మనస్తాపం చెంది ఓ బాలిక ఆత్మహత్యాయత్నం చేసింది. సకాలంలో స్థానికులు గుర్తించి ఆమెను కాపాడారు. వివరాలు... అనంతపురానికి కూతవేటు దూరంలో ఉన్న ఓ మండలానికి చెందిన బాలిక అనంతపురంలోని కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఐదు నెలల క్రితం తల్లిదండ్రులు ఆ బాలికకు బలవంతంగా పెళ్లి చేశారు. దీంతో కాపురానికి వెళ్లకుండా ఆమె పుట్టింట్లోనే ఉండిపోయింది. దీంతో ఆమెను మెట్టినింటికి బలవంతంగా పంపేందుకు తల్లిదండ్రులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే మెట్టినింటి నుంచి కూడా ఒత్తిళ్లు మొదలు కావడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న బాలిక గురువారం ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వచ్చేసి నేరుగా అనంతపురంలోని హెచ్చెల్సీ వద్దకు చేరుకుని కాలువలో దూకే ప్రయత్నం చేసింది. సకాలంలో అక్కడున్న వారు అప్రమత్తమై బాలికను పట్టుకుని ఆరా తీశారు. దీంతో జరిగిన విషయం చెప్పి బోరున విలపించింది. ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ, డీసీపీఓ మంజునాథ, చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ కృష్ణమాచారి, మహిళా పోలీసులు, కార్మిక శాఖ అధికారి సుజాత... బాధితురాలిని కార్యాలయానికి పిలిపించుకుని మాట్లాడారు. అనంతరం సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి ఎదుట హాజరుపరిచి, ఆమె ఆదేశాల మేరకు బాలసదన్‌లో తాత్కాలిక వసతి కల్పించారు. రెండు కుటుంబాల వారిని శుక్రవారం పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి కేసు నమోదు చేయించనున్నట్లు అధికారులు తెలిపారు.

బెంగళూరులో శెట్టూరు వాసి దుర్మరణం



వాహనంలో చిక్కుకున్న లక్ష్మీనారాయణ మృతదేహం

శెట్టూరు: పొట్టకూటి కోసం బెంగళూరు నగరానికి వలస వెళ్లిన వ్యక్తి అక్కడ చోటు చేసుకున్న ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... శెట్టూరుకు చెందిన బోయ లక్ష్మీనారాయణ(39) మూడేళ్ల క్రితం బతుకు తెరువు కోసం బెంగళూరుకు వెళ్లి ఓ కోళ్ల ఫారంలో డ్రైవర్‌గా పనిలో చేరాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం వైట్‌ఫీల్డ్ వద్ద కోళ్ల లోడ్‌తో వెళుతుండగా ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ ఢీ కొంది. దీంతో వాహనంలోనే చిక్కుకుని లక్ష్మీనారాయణ మృతి చెందాడు. మృతునికి భార్య అనిత, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

ప్రాణం బలిగొన్న భూవివాదం



హతుడు గంగాధర

రాయదుర్గం: దాయాదులు జరిపిన దాడిలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గం మండలం చదం గ్రామానికి చెందిన దొణప్ప, చిన్న గంగప్ప, పెద్ద గంగప్ప దాయాదులు. వీరికి భాగపరిష్కారం కింద చెరో మూడు ఎకరాల పొలం వచ్చింది. దీనిని ఎవరికి వారు వారి కుమారులకు పంచారు. అయితే ఓ గట్టు విషయంగా కొంత కాలంగా రెండు కుటుంబాల మధ్య వివాదం నెలకొంది. పొలానికి వెళ్లిన ప్రతి సారీ దీనిపై రెండు కుటుంబాల వారు ఘర్షణ పడేవారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం దొణప్ప భార్య రుద్రమ్మ తన కుమారుడు గంగాధర్ (26)తో కలసి పొలానికి వెళ్లినప్పుడు పెద్ద, చిన్న గంగప్పల కుమారులు సూరి, వంశి, శివ గొడవకు దిగారు. గంగాధర్‌పై విచక్షణారహితంగా దాడి చేశారు. రుద్రమ్మ కేకలు విని చుట్టుపక్కల రైతులు అక్కడకు చేరుకునేలోపు దాయాదులు పరారయ్యారు. బంధువుల సాయంతో క్షతగాత్రుడిని వెంటనే రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బళ్లారిలోని బిమ్స్‌కు వైద్యులు రెఫర్ చేశారు. అక్కడ చికిత్సకు స్పందించక గంగాధర్ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. విషయం తెలియానే నిందితులు అజ్ఞాతంలోకి వెళ్లారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ జయ నాయక్ తెలిపారు. కాగా, హతుడికి భార్య మల్లీశ్వరి, ఏడాదిలోపు వయసున్న పాప ఉన్నారు. కాగా, గంగాధర్ మృతితో పోలీసులు అప్రమత్తమై గ్రామంలో పికెట్ ఏర్పాటు చేశారు.

రైల్వే ఉద్యోగి ఆత్మహత్య

- అనారోగ్యం, అప్పులు బాధ తాళలేక బలవన్మరణం



ఈరేష్ (ఫైల్)

గుంతకల్లు: స్థానిక శాంతినగర్‌లోని రైల్వేక్వార్టర్స్‌లో నివాసముంటున్న రైల్వే ఉద్యోగి ఈరేష్ (45) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య నాగలక్ష్మి, ఓ కుమారుడు ఉన్నారు. రైల్వే డీజిల్‌షెడ్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న ఆయన ఓ మంచి క్రికెటర్ కూడా. కొంతకాలంగా సయాటికాతో పాటు మైగ్రెయిన్‌తో ఇబ్బంది పడుతున్నాడు. భార్య సైతం ఆస్తమాతో బాధపడుతుండుతోంది. ఈ క్రమంలో వైద్య చికిత్సలు, ఇతర అవసరాలకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేశాడు. ఈ అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.10 లక్షలకు చేరుకుంది. అయినా జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఈరేష్... గురువారం తెల్లవారుజామున ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం నిద్రలేచిన కుటుంబసభ్యులు ఫ్యాన్‌కు విగతజీవిగా వేలాడుతున్న ఈరేష్‌ను చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని, పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చికిత్స ఫలించక వ్యక్తి మృతి

గుంతకల్లులోని సత్యనారాయణపేటలో నివాసముంటున్న రామకృష్ణ (46) గుండెపోటుతో మృతి చెందాడు. బంధువులు తెలిపిన మేరకు... పాతకొత్తచెరువుకు చెందిన రామకృష్ణ గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో పాయింట్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల గుండె సంబంధిత సమస్య తలెత్తడంతో అనంతపురంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేరాడు. పరీక్షించిన వైద్యులు ఆయనకు స్టంట్ వేశారు. కాగా, బ్లడ్ తక్కువగా ఉందని వైద్యులు తెలపడంతో రక్తం ఎక్కించుకునేందుకు బుధవారం అదే కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ రక్తం ఎక్కిస్తున్న సమయంలో ఒక్కసారిగా బీపీ తగ్గి గుండెపోటుకు గురై మృతి చెందాడు.

గర్భిణి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని కె.ఊబిచెర్ల గ్రామానికి చెందిన గర్భిణి ఉమాదేవి (26) ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమెకు భర్త రామాంజనేయులు, రెండేళ్ల వయసున్న కుమారుడు ఉన్నారు. తమకున్న పొలంలో పంటల సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కుటుంబంలో నెల కొన్న సమస్యలు కొన్నేళ్లుగా అపరిష్కృతంగానే ఉండిపోయాయి. ఈ క్రమంలో రెండోసారి గర్భం దాల్చింది. కాగా, కుటుంబసమస్యలతో మనస్తాపం చెందిన ఆమె బుధవారం రాత్రి తన శరీరానికి నిప్పంటించుకుంది. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు కాలిన గాయాలతో పడి ఉన్న ఆమెను వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఓబులేసు గుత్తి ప్రభుత్వాస్పత్రికి చేరుకుని ఉమాదేవి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. దాదాపు 80 శాతం శరీరం కాలడంతో ఐదు నెలల గర్భస్థ శిశువు కూడా మృతిచెందినట్లుగా వైద్యులు నిర్ధారించి, మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


జేఎన్‌టీయూలో కొలువుల పంట



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో అదరగొట్టారు. రూ. 10 లక్షలు, రూ.9 లక్షలు, రూ.7 లక్షలు వార్షికాదాయం దక్కే కొలువులు సాధించారు. బయట కళాశాలల్లో ఉద్యోగాలు రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఏకంగా 147 మంది ఉద్యోగాలు సాధించి సత్తా చాటడం గమనార్హం. టీసీఎస్ కంపెనీలో 121 మందికి ఉద్యోగాలు దక్కాయి. ఎల్‌అండ్‌టీలో 11 మంది, కాగ్నిజెంట్‌లో 9, ఫ్యాక్ట్‌సెట్‌లో ఆరుగురు , మోస్‌చిప్‌లో ముగ్గురు ఉద్యోగాలు సాధించారు. ఫ్యాక్ట్‌సెట్ కంపెనీ ఏకంగా రూ.10 లక్షల వార్షిక వేతనం ప్రకటించింది. కాగ్నిజెంట్ గరిష్టంగా రూ.9 లక్షలు, కనిష్టంగా రూ. 7 లక్షలు వార్షిక వేతనం అందించనున్నట్లు తెలిసింది. మోస్‌చిప్, ఎల్‌అండ్‌టీ కంపెనీ రూ.6 లక్షలు వార్షిక వేతనం చెల్లిస్తామని పేర్కొంది. ఈ సందర్భంగా విద్యార్థులను వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు, ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి అభినందించారు.

ఎంసీఏ ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న జేఎన్‌టీయూఏ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి, మాజీ రిజిస్ట్రార్ శశిధర్

అనంతపురం: జేఎన్‌టీయూఏ ఇంజినీరింగ్ క్యాంపస్ కళాశాలలో నిర్వహించిన ఎంసీఏ రెండో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్-20) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను గురువారం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి విడుదల చేశారు. తక్కువ సమయంలోనే ఫలితాల విడుదలకు డిప్యూటీ కంట్రోలర్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి.లలితకుమారి చేసిన కృషిని అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.వసుంధర, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, విభాగాధిపతులు ప్రొఫెసర్ భువన విజయ, ప్రొఫెసర్ టి.బాలనరసయ్య, డాక్టర్ కేఎఫ్ భారతి, డాక్టర్ జి. మమత, పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం.రామశేఖర్‌రెడ్డి, పీఆర్వో డాక్టర్ బి.ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని ముక్కలు చేసే దిశగా 'కూటమి' అడుగులు

- అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ

రాప్తాడురూరల్: రాష్ట్రాన్ని ముక్కలు చెక్కలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగేస్తోందని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ ధ్వజమెత్తారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నవ్యాంధ్ర ప్రదేశ్‌కు అమరావతే రాజధాని అంటూ సుప్రీంకోర్టులో పిటీషన్ వేయడం ఎంత ముఖ్యమో, రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధి కూడా అంతే ముఖ్యమనే అంశాన్ని కూటమి పెద్దలు విస్మరించడం బాధాకరమన్నారు. అత్యంత వెనుకబడిన ప్రాంత ప్రయోజనాలను తుంగలో తొక్కి, ఐదేళ్లలో ఒక్క అమరావతికే రూ.లక్ష కోట్లు ఖర్చు పెడతామని చెబుతున్నారన్నారు. మరోవైపు రాయలసీమకు హక్కుగా దక్కాల్సిన హైకోర్టు, ఉత్తరాంధ్ర జీవనాడిగా ఉన్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ రద్దుపై స్పష్టత ఇవ్వడం లేదన్నారు. జిల్లాలోని సీఐడీ, ఎన్‌డీపీఎస్ కోర్టులను కర్నూలు, తిరుపతి జిల్లాలకు తరలించి, ప్రాంతాల మధ్య తగాదాలను సృష్టించే కుట్రకు తెరతీయడం దారుణమన్నారు. రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టులు ఊసెత్తడం లేదని, విభజన చట్టంలోని అంశాలను సైతం అమరావతికే తరలించే కుట్ర జరుగుతోందన్నారు. ఈ పరిస్థితులను గమనిస్తున్న రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రజలు ఇకపై రాష్ట్రంలో కలిసి ఉండలేమన్న భావనతో మరో వేర్పాటువాద ఉద్యమాలకు పావులు కదుపుతున్నారన్నారు. కడపలో జరిగిన అఖిలపక్ష సమావేశం, అంతకుముందు అనంతపురంలో అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం, విశాఖపట్నంలో జరుగుతున్న విశాఖ ఉక్కు ఉద్యమాలే ఇందుకు నిదర్శమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఒంటెద్దు పోకడలకు కాకుండా మేధావుల సూచనల మేరకు, మూడు ప్రాంతాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నీళ్లు, నిధులు, నియామకాలు చేపట్టాలని సూచించారు.

'జిందాల్' ఆధునికీకరణపై ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు

బొమ్మనహాళ్: మండలంలోని హరేసముద్రం పంచాయతీ పరిధిలోని జిందాల్ కర్మాగారం ఆధునికీకరణ, విస్తరణ, పర్యావరణ అనుమతులపై కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. 1994లో శాతవాహన ఇస్పాత్ కర్మాగారాన్ని స్థాపించగా 2017లో అది మూతపడింది. ఇదే పరిశ్రమను రెండేళ్ల క్రితం జిందాల్ షా తీసుకుని పైపుల తయారీ చేపట్టారు. అయితే మరికొంత భూమిని కొనుగోలు చేసి 140 ఎకరాల్లో పరిశ్రమలను విస్తరించి, ఐరన్‌పైపులు డీఐ పైపు ఫిట్టింగ్ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు అనుమతులివ్వాలంటూ ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి జిందాల్ షా దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై గురువారం జిందాల్ కర్మాగారం వద్ద కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, కర్నూలు జిల్లా కాలుష్య నియంత్రణ బోర్డు ఎస్ఈ శివశంకర్ నాయక్, అనంతపురం ఈఈ మునిప్రసాద్, బొమ్మనహాళ్ తహసీల్దార్ మునివేలు తదితరులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. హరేసముద్రం, కురువల్లి, బొమ్మనహాళ్, సిద్ధరాంపురం , చంద్రగిరి, బొల్లనగుడ్డం గ్రామాల ప్ర,జలు పాల్గొన్నారు. ఫ్యాక్టరీ విస్తరణ, ఆధునికీకరణపై తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని, కంపెనీ పరిసర గ్రామాల్లో సేవా కార్యక్రమాలతో పాటు గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని, రైతులకు పరిహారం చెల్లించాలని, కంపెనీలో స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలని కోరారు. హరేసముద్రం, కురువల్లి, చంద్రగిరి, సిద్ధరాంపురం, బొమ్మనహాళ్ గ్రామాల్లో విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. మండల కేంద్రంలో ఫ్యాక్టరీ తరపున చిన్న పిల్లలు, పెద్దలకు ఆస్పత్రి నిర్మించాలన్నారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు ఆర్డీఓ తెలిపారు.

ఎంప్లాయీస్ సంఘ్ విజయం



సంబరాల్లో ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు

గుంతకల్లు: రైల్వే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో గుంతకల్లు డివిజన్‌లో దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ విజయం సాధించింది. స్థానిక రైల్వే వైట్‌హౌస్‌లో గురువారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. డివిజన్ వ్యాప్తంగా పోలైన 12,364 ఓట్లలో 113 ఓట్లను ఇన్‌వాల్యూడ్‌గా గుర్తించారు. దాదాపు 10 రౌండ్ల లెక్కింపులో ఎంప్లాయీస్ సంఘ్‌కు 5,966, మజ్దూర్ యూనియన్‌కు 5,723 ఓట్లు దక్కాయి. దీంతో 243 ఓట్ల తేడాతో ఎంప్లాయీస్ సంఘ్ విజయం సాధించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. పోటీలో ఉన్న డీఎంఆర్‌కేఎస్‌కు 372 ఓట్లు, ఐఆర్ఎంయూకు 132, ఆర్ఎంయూకు 58 ఓట్లు పడ్డాయి. కాగా, చిరకాల ప్రత్యర్థి మజ్దూర్ యూనియన్‌పై విజయం సాధించడంతో ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు విజయోత్సవంలో మునిగితేలారు. రైల్వే ఆస్పత్రి సమీపంలోని సంఘ్ కార్యాలయం వద్దకు నాయకులు, కార్మికులు, ఉద్యోగులు చేరుకుని పెద్దఎత్తున బాణాసంచా పేల్చారు. స్వీట్లు పంపిణీ చేశారు. గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, అధ్యక్షుడు బాబును సత్కరించారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు కె.మల్లికార్జున, బాలకృష్ణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పెనుకొండ బాబయ్య ఉరుసు

పెనుకొండ: హిందూముస్లింల ఆరాధ్య దైవంగా విరాజిల్లుతున్న పెనుకొండలోని బాబయ్య స్వామి ఉరుసు ఉత్సవాలు శుక్రవారం దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా నేతృత్వంలో ప్రారంభం కానున్నాయి. బాబయ్య స్వామి గొప్పతనాన్ని చాటిచెప్పేలా ఏటా బ్రహ్మోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తుంటారు. శుక్రవారం రాత్రి 10 గంటలకు మొదటి గంధం వేడుకలు పీఠాధిపతి సజ్జద్‌బాబా ఆధ్వర్యంలో ప్రారంభమవుతాయి. అంతకు ముందు సర్వమత సమ్మేళనంలో వివిధ రాష్ట్రాలకు చెందిన మత పెద్దలు పాల్గొని ప్రసంగించనున్నారు.

క్లుప్తంగా

ఘనంగా ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అనంతపురం రూరల్: శ్రీకృష్ణదేవరాయ ఉద్యాన కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ పల్లె వెంకట కృష్ణకిశోర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు పెద్దల పట్ల గౌరవంతో మెలగాలన్నారు. విద్యార్థి దశ నుంచే కష్టపడే తత్వం అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకుంటారన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విశ్రాంత డీజీపీ శంకర రెడ్డి, కళాశాల డీన్ రవీంద్రా రెడ్డి, ప్రొఫెసర్ శివనంద తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం రూరల్: ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అక్రమంగా విద్యుత్ సరఫరా నిలిపివేసి తమను ఇబ్బందులకు గురి చేస్తున్న ఏఈ ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. రాజీవ్‌కాలనీ పంచాయతీ మల్లు స్వరాజ్యం కాలనీకి విద్యుత్ సరఫరా నిలిపివేడంతో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యవర్గ సభ్యులు వలి, మసూద్ మాట్లాడుతూ.. ఎలాంటి సమాచారం అందించకుండా డీ6 సెక్షన్ ఏఈ ప్రసాద్ అక్రమంగా విద్యుత్ సరఫరా నిలిపివేయంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కరెంట్ లేక పోవడంతో విద్యార్థులు, చిన్నారులు అవస్థలు పడుతున్నారని గుర్తు చేశారు. విద్యుత్ ఏఈపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు విన్నవించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకట నారాయణ, ఇర్ఫాన్, నూరుల్లా, నాగేంద్ర, అలీ తదితరులు పాల్గొన్నారు.

నేడు కృత్తిక మహా దీపోత్సవం

అనంతపురం కల్చరల్: అనంతలో తొలిసారి అరుణాచల శివ కృత్తికా మహాకార్తీక దీపోత్సవ వేడుకలు జరుగనున్నాయి. ఈ మేరకు ఆలయ వ్యవస్థాపకుడు, కార్పొరేటర్ గురుశేఖర బాబు గురువారం ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయం వేదికగా శుక్రవారం సాయంత్రం 6 గంటలకు దీపోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. దీపోత్సవానికి ఇప్పటికే పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశామన్నారు. అరుణాచలంలో ఏటా జరిగే కృత్తికా కార్తీక దీపోత్సవాన్ని సందర్శించుకోలేని భక్తుల కోసం నగరంలోనే అదే నమూనాలో దీపోత్సవం నిర్వహిస్తామన్నారు.

15న సంగీత సత్సంగం

అనంతపురం కల్చరల్: ఘంటసాల జయంత్యుత్సవాలను పురస్కరించుకుని ఈనెల 15న సంగీత సత్సంగం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు పాలసముద్రం నాగరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఘంటసాల ఆరాధన సమితి వారి ఆధ్వర్యంలో స్థానిక మూడవ రోడ్డులోని ఘంటసాల భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి సత్సంగం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ఔత్సాహికులైన గాయనీ గాయకులకు పాటలు పాడేందుకు అవకాశం కల్పిస్తామని తెలియజేశారు. ఆసక్తి కల్గిన వారు 9441012309 నంబర్‌కు ఫోన్ చేసి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న సీఐ వి.రాజేంద్రనాథ్ యాదవ్

అనంతపురం: వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ ఆధ్వర్యంలో థామస్ మన్రో కూడలి, టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్, ఎస్‌ఐ రుష్యేంద్ర బాబు ఆధ్వర్యంలో క్లాక్‌టవర్, అంబేడ్కర్ సర్కిల్‌లో త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ ఆధ్వర్యంలో గుత్తి రోడ్డులో, నాలుగవ పట్టణ సీఐ కే.సాయినాథ్ ఆధ్వర్యంలో రుద్రంపేట సర్కిల్‌లో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయా రహదారుల్లో వెళ్లిన ప్రతి వాహనాన్ని పరిశీలించారు. రోడ్డు భద్రత ఉల్లంఘనలపై చర్యలు తీసుకున్నారు. వాహనదారులందరూ విధిగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. అంతేకాకుండా మద్యం, గంజాయి అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టారు.

నగురబాట..!

- నగరంలో నాసిరకంగా ప్యాచ్ వర్క్‌లు
- గుంతల్లో కంకరవేసి వదిలేసిన వైనం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- రూ.47 లక్షల నిధులు వృథా



నాయక్ నగర్‌లో రోడ్డు దుస్థితి ఇలా..



విద్యుత్ నగర్ సర్కిల్ నుంచి నాయక్ నగర్‌కు వెళ్లే మార్గంలో కంకర తేలిన దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో రహదారుల నిర్మాణం నగుబాటుగా మారింది. టీడీపీ నేతల నిర్వాకంతో నగరంలో అభివృద్ధి పనులకు స్వస్తి పలికారు. అక్కడక్కడ జరిగే అభివృద్ధి పనులను సైతం ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించడం లేదు. దీంతో పనులు నాసిరకంగా సాగుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తద్వారా నగరపాలక సంస్థ ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది. పన్నుల రూపేణ ప్రజలు చెల్లించే డబ్బుతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతారు. అటువంటి ప్రజల డబ్బును బాధ్యతగా వినియోగించే పరిస్థితి లేకుండా పోయింది.

రూ.47 లక్షలతో టెండర్లు

నగరంలోని సుభాష్ రోడ్డు, రాజు రోడ్డు, తిలక్ రోడ్డు, శ్రీకంఠం సర్కిల్, విద్యుత్ నగర్, రాంనగర్, పాతూరు, సినిమా థియేటర్, రైల్వే ఫీడర్ రోడ్డు, తదితర ప్రధాన రోడ్లతో పాటు నగరంలోని 1, 2, 3, 4, 5 రోడ్లు, కోవూర్‌నగర్, లక్ష్మీనగర్, హౌసింగ్ బోర్డు, అశోక్ నగర్, సాయి నగర్, ఆర్‌కే నగర్, తదితర ప్రాంతాల్లోని రోడ్ల మధ్యలో భారీ గుంతలు ఏర్పడ్డాయి. గుంతలతో ప్రజలు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. గతంలో సాక్షిలో వరుస కథనాలతో అధికారుల్లో చలనం వచ్చింది. ఈ క్రమంలో నగరంలోని 50 డివిజన్లలోని 74 సచివాలయాల పరిధిలో 275 చోట్ల గుంతలను అధికారులు గుర్తించారు. ఇటీవల గుంతలకు ప్యాచ్ వర్క్‌లు వేయడానికి ఏకంగా రూ.47 లక్షలతో టెండర్లను ఆహ్వానించారు. కాగా అందులో రూ.30 లక్షలకు టెండర్లు ఖరారు కాగా, మరో 17 లక్షలకు సంబంధించి రెండో కాల్ పిలిచారు. ప్యాచ్ వర్క్‌లకు అంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడం పలు విమర్శలకు దారి తీస్తోంది.

తేలుతున్న కంకర

నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ప్యాచ్ వర్క్ పనులు నాసిరకంగా సాగుతున్నాయి. గుంతలను పైపైన కట్ చేసి అందులో కంకర (వెట్‌మిక్స్) వేస్తున్నారు. తదుపరి రెండు లేయర్ పనులను చేపట్టడం లేదు. దీంతో కంకర తేలుతోంది. భారీ వాహనాలు, కార్లు గుంతలపై వెళ్లినప్పుడు కంకర ఎగురుతోంది. దీంతో నగర ప్రజలకు ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. పొరపాటున కంకర కంటికి, కణతకు తగిలితే కంటిచూపు, ప్రాణం కోల్పోయే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికైనా పనులను నాణ్యతతో చేపడుతారో లేదో వేచి చూడాలి.

వర్షం కారణంగా ఆలస్యం

నగరంలో ప్యాచ్ వర్క్ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నాం. కొన్ని ప్రాంతాల్లో గుంతలకు వెట్‌మిక్స్ వేశాం. వర్షం కారణంగా తాత్కాలికంగా పనులు ఆపడం జరిగింది. నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలు ఇబ్బందులు పడకుండా గుంతలను పూడ్చివేయిస్తాం.

– షాకీర్, ఈఈ, నగరపాలక సంస్థ

అన్నదాతకు అండగా నిలుద్దాం

కనగానపల్లి: రైతు సమస్యలపై శుక్రవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు తరలివచ్చి అన్నదాతలకు అండగా నిలవాలని రాప్తాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో పాటు, ప్రభుత్వ హామీల అమలుపై నిలదీస్తామన్నారు. నియోజక వర్గంలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో పాటు కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.



మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న మేయర్ వసీం సలీం

ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొద్దాం

అనంతపురం కార్పొరేషన్: రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై శుక్రవారం చేపట్టే ర్యాలీతో ఒత్తిడి తీసుకొద్దామని మేయర్ మహమ్మద్ వసీం సలీం పిలుపునిచ్చారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు సంవత్సరానికి రూ.20 వేలు ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా పైసా కూడా జమ చేయలేదన్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు సాగే ర్యాలీలో రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ర్యాలీకి తరలిరండి

చెన్నేకొత్తపల్లి: రైతుల సమస్యలపై శుక్రవారం పుట్టపర్తిలో జరిగే ర్యాలీకి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని జెడ్పీటీసీ ఎం.గోవిందరెడ్డి గురువారం ఓ ప్రకటనలో కోరారు. ర్యాలీ పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు సాగుతుందన్నారు. అతిథిగా రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హాజరవుతారన్నారు. చెన్నేకొత్తపల్లి మండలం నుంచి సర్పంచులు, ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గిరిగల గంప ఊరేగింపు



గంపను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి బొలికొండ అక్కమ్మ దేవతల 'గిరిగల గంప' ఊరేగింపు గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. 73 ఏళ్ల వయసు కల్గిన అక్కమ్మ దేవతల పూజారి అక్కులప్ప (పూజారప్ప) నాలుగేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో నాలుగు రోజులుగా నూతన పూజారి ఎంపిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. అమ్మవారికి పుణ్యహవాచనం, ఎలవపూజ, మహామంగళ హారతి చేపట్టారు. ఈ క్రమంలో అక్కంపల్లి బండపై జరిగిన పూజా కార్యక్రమాల్లో అమ్మవారు ఒడిలోకి వచ్చి పూజారి మహేష్ కుమారుడు 15 నెలల చిన్నారి మహారుషి పూజారిగా ఉండాలంటూ సూచించారని గ్రామస్తులు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం అక్కంపల్లి బండ నుంచి గిరిగల గంప ఊరేగింపు చేపట్టారు. ఉరుములు, మేళాలు, గిరిగల గంపపై పూలు చల్లుకుంటూ ఊరేగింపు సాగింది. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. రాచానపల్లిలోని బయట గుడి వరకు ఊరేగింపు చేసి అక్కడి గుడిలో గంపను ఉంచారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



భూ సమస్యలపై తహసీల్దార్‌కు అర్జీలు అందజేస్తున్న బాలేపాళ్యం రైతులు

చెన్నేకొత్తపల్లి: కొన్నేళ్లుగా నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సురేష్ కుమార్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని పులేటిపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పులేటిపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని రైతులు భూ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. విచారించి త్వరగా పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బందితో పాటు సచివాలయం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 28 అర్జీల స్వీకరణ

కనగానపల్లి: మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 28 అర్జీలు వచ్చినట్లు స్థానిక రెవెన్యూ అధికారులు తెలిపారు. తహసీల్దార్ జీ.వీ. ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం వద్ద అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కనగానపల్లి, కోనాపురం, బాలేపాళ్యం గ్రామాల రైతులు, ప్రజలు హాజరై పలు సమస్యలపై అధికారులకు అర్జీలు అందజేశారు. ఇందులో భూ సమస్యలపై 5, రేషన్‌కార్డుల కోసం 16, పింఛన్ల కోసం 9 మంది అర్జీలు అందజేసినట్లు గ్రామ రెవెన్యూ అధికారి మారుతి తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్ నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతపురం కార్పొరేషన్: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం నగరపాలక సంస్థ ఎదుట ధర్నా సీఐటీయూ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రెగ్యులర్ కార్మికులకు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ మొత్తం ఇవ్వాలన్నారు. జీపీఎఫ్ అకౌంట్స్ ఓపెన్ చేయాలని కోరారు. ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ నంబర్ 36 ప్రకారం రూ.21వేలు వేతనం అమలు చేయాలన్నారు. సైపుణ్యాన్ని బట్టి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్ఎంఆర్ కార్మికులకు 4 నెలలు వేతనం బకాయి ఉందని.. వాటిని వెంటనే ఇవ్వాలని కోరారు. ఇంక్రిమెంట్స్ సక్రమంగా అమలు చేస్తూ పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, నగర ప్రధాన కార్యదర్శులు ముర్తుజా, వెంకట నారాయణ, నాయకులు కే.నాగభూషణ, ఓబుళపతి, మురళీ, గురురాజు, సంజీవ రాయుడు, పోతులయ్య, ఏటీఎం నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరం



పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ వైద్యుడు సుధాకర్

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడులో గురువారం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ వైద్యుడు సుధాకర్, జక్కలచెరువు పశు వైద్యుడు ప్రదీప్ కృష్ణ గ్రామంలోని పశువులను పరీక్షించారు. 90 శాతం కచ్చితత్వంతో పేయి దూడలు పుట్టుకను ఉద్దేశించి లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. పశు వైద్యులు మాట్లాడుతూ పేయి దూడలు పొందే లింగ నిర్ధారిత వీర్యం సేకరణకు ఇంజెక్షన్లను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోందన్నారు. అనంతరం గ్రామంలో పశువులలో చూడి నిర్ధారణ, తిరిగి ఎదకు వస్తూ కట్టకుండా నిలిచి పోయినవి, పూర్తిగా ఎదకు రాని 34 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏహెచ్ఏలు సాల్మన్‌రాజు, అల్లూరి సీతారామరాజు పాల్గొన్నారు.

సాయినాథుడికి పుష్పాభిషేకం



అలంకరణలో సాయినాథుడు

అనంతపురం కల్చరల్: ఏటా మార్గశిరంలో సాగే మహా పుష్పాభిషేక వేడుకలు గురువారం కమనీయంగా సాగాయి. స్థానిక వేమన టెలీభవన్ ఎదురుగా ఉన్న షిర్డీ సాయిబా మందిరంలో సాయంత్రం నుంచి రాత్రి వరకు సాయినాథుడికి పుష్పాలంకార సేవలు, పుష్పాభిషేకం జరిగాయి. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు బారులు తీరి సాయినాథుడిని వివిధ రకాల పుష్పాలతో ఆరాధించుకున్నారు. సాయి నామస్మరణతో పల్లకీ సేవ, ప్రసాద అల్పాహార వితరణ భక్తిశ్రద్ధలతో జరిగింది. కార్యక్రమంలో మందిరం అధ్యక్షుడు జయచంద్ర చౌదరి, కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, నాగానందం, వెంకటేశులు, రవీంద్రనాథ్, శ్రీరాములు పాల్గొన్నారు.

స్కేటింగ్ పోటీల్లో సత్తా



అనంతపురం: జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో అనంతపురం జిల్లా చిన్నారులు సత్తా చాటారు. మైసూర్‌లో ఈ నెల 5న ప్రారంభమైన పోటీలు 15వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. ఇందులో హంజా హుస్సేన్ రజత పతకం, హార్దిక్ రెడ్డి రెండు రజత పకాలు, సుచిత్‌రెడ్డి ఒక రజతం, ఒక కాంస్య పతకం సాధించారు. పతకాలను దక్కించుకున్న చిన్నారులను జిల్లా ఆర్గనైజర్ రవిబాల, చీఫ్ కోచ్ నాగేంద్ర అభినందించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

రాయదుర్గంటౌన్: వేర్వేరు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారు స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రాయదుర్గం పట్టణంలోని కేబీ ప్యాలెస్ రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న జిలాన్ బాషాను ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని బళ్లారి రోడ్డు మదరసా ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో చదంగొల్లలదొడ్డికి ద్విచక్ర వాహనంలో వెళ్తున్న మల్లేశప్పను ఓ లగేజీ ఆటో బలంగా ఢీకొంది. ప్రమాదంలో మల్లేశప్ప ఎడమ కాలు దెబ్బతింది. డి.హీరేహాళ్ మండలం కల్యం గ్రామంలోని పెట్రోల్ బంకు సమీపంలో రప్పం (కర్ణాటక) గ్రామానికి చెందిన లింగన్న బైక్ అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యాడు. ఈ ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో అపహరణ

తాడిపత్రిటౌన్: పట్టణంలోని చేపల మార్కెట్ సమీపంలో నివసిస్తున్న మల్లేష్‌కు చెందిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. పండ్ల వ్యాపారం చేసుకునే మల్లేష్ బుధవారం రాత్రి ఆటోను ఇంటి ఆవరణలో ఉంచి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో.. గుర్తు తెలియని వ్యక్తులు ఆటోను అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

గార్లదిన్నె: తిమ్మంపేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై గురు వారం కారు, లారీ ఢీకొన్నాయి. పోలీసుల వివరాలు మేరకు.. మంత్రాలయం నుంచి బెంగళూరుకు వెళ్తున్న కారు తిమ్మంపేట సమీపంలో ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. అయితే ఎవరికీ ఏం కాలేదు. ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతింది. పోలీసులు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని రోడ్డు ప్రమాదంపై ఆరా తీశారు.

బీసీసీఐ టోర్నీలో రాణించిన చక్రిక



అనంతపురం: బీసీసీఐ ఆధ్వర్యంలో జైపూర్‌లోని ఆర్సీఏ అకాడమీ స్టేడియంలో జరుగుతున్న అండర్–15 మహిళల వన్డే టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు సెమీఫైనల్‌కు చేరింది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో గుజరాత్‌పై ఆంధ్ర జట్టు విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరింది. ఈ మ్యాచ్‌లో అనంతపురంలోని తపోవనం క్రికెట్ అకాడమీ క్రీడాకారిణి దండు చక్రిక బౌలింగ్‌లో సత్తా చాటింది. 6.5 ఓవర్లలో 22 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంపిక చేసుకున్న ఆంధ్ర జట్టు 30 ఓవర్లలో 187 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గుజరాత్ జట్టు 31.5 ఓవర్లలో 164 పరుగులకు ఆలౌట్ అయింది.

పోలీస్ పెట్రోల్ బంక్‌కు స్థల పరిశీలన

గుత్తి: పట్టణంలోని పోలీసు క్వార్టర్స్ ఏరియాలో త్వరలో ఏర్పాటు చేయబోతున్న పోలీస్ పెట్రోల్ బంక్ ఏర్పాటు స్థలాన్ని గురువారం అనంతపురం ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఇంతియాజ్ బాషా పరిశీలించారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్, ఏఎస్ఐ నాగమాణిక్యం, ఐటీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తో భేటీ



వైఎస్ జగన్‌తో వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి శాలువా కప్పి సన్మానించారు.

మహిళను కాపాడిన పోలీసులు



మౌనికకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్

పెద్దవడుగూరు: ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళ ప్రాణాలు పోలీసులు కాపాడారు. వివరాలు.. మండలంలోని తురకపల్లికి చెందిన మౌనికను నార్పల గ్రామం చెందిన వడ్డే శివకు ఇచ్చి మూడేళ్ల కిందట వివాహం చేశారు. కుటుంబ కలహాలతో ఆమె ఇటీవల పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన ఆమె చాగల్లు డ్యాంలోకి దూకాలని ప్రయత్నం చేస్తుండగా స్థానికులు గుర్తించి ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్‌కు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి సందర్శించి ఆమె తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి మౌనికను అప్పజెప్పారు. సకాలంలో పోలీసులు రావడంతో తమ బిడ్డ ప్రాణాలతో బయట పడిందని కుటుంబ సభ్యులు అన్నారు.

పశువుల షెడ్ల నిర్మాణం నాణ్యతగా ఉండాలి



వెస్ట్ నరసాపురంలో పశువుల షెడ్‌ను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సలీంబాషా

శింగనమల: ఉపాధి పథకం కింద పశువుల షెడ్లు నాణ్యతగా నిర్మించేలా సిబ్బంది పర్యవేక్షించాలని డీడబ్ల్యూఎంఏ పీడీ సలీంబాషా సూచించారు. గురువారం మండలంలోని ఆకులేడు, వెస్ట్ నరసాపురం గ్రామాల్లో పశువుల షెడ్లు, ఫీడర్ చానల్లు నిర్మాణం పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని సిబ్బందికి సూచించారు. ఉపాధి పథకం కింద కొండల్లో మొక్కల పెంపకం చేపట్టడానికి పరిశీలిస్తున్నామన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఏపీఓ శ్రీదేవి, టెక్నికల్ అసిస్టెంట్లు నారాయణస్వామి, ఓబిలేసు, అలివేలమ్మ పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి చేయూతనివ్వండి



జాతీయ నాయకుల చిత్రపటాలు అందజేస్తున్న నాగభూషణ

కనగానపల్లి: గ్రంథాలయ అభివృద్ధికి దాతలు విరాళాలు అందించి చేయూతనందించాలని మండల గ్రంథాలయాధికారి గోవింద కోరారు. గురువారం మండల కేంద్రానికి చెందిన నాగభూషణ జాతీయ నాయకుల చిత్రపటాలను గ్రంథాలయానికి వితరణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు ఆయన్ను సన్మానించారు.